సాక్షి
హనుమకొండ

గురువారం । 25 । ఏప్రిల్ । 2024



నేటితో నామినేషన్ల పూర్తి

వరంగల్, మహబూబాబాద్ లోక్‌సభ నియోజకవర్గాలకు సంబంధించిన నామినేషన్ల దాఖలు ప్రక్రియ గురువారం మధ్యాహ్నం మూడు గంటలకు ముగియనుంది. - IIలో▸



పలు రైళ్ల హాల్టింగ్ రద్దు

ఉప్పల్ రైల్వే స్టేషన్ అప్‌లైన్ డైరెక్షన్‌లో ఈనెల 25 నుంచి 27 వరకు పలు రైళ్ల హాల్టింగ్‌ను రద్దు చేస్తున్న రైల్వే శాఖ అధికారులు తెలిపారు. - IIలో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం 41.0°/27.0°

జిల్లాలో ఉదయం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం ఎండతోపాటు ఉక్కపోత ఉంటుంది. రాత్రి ఆహ్లాదకరంగా ఉంటుంది.

జనజాతరతో జోష్



మడికొండ జనజాతర సభలో ప్రసంగిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి, పక్కన అభ్యర్థి కడియం కావ్య



హాజరైన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు

భారీగా తరలివచ్చిన జనం.. కిక్కిరిసిన మడికొండ రోడ్డు

- ఓరుగల్లుపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వరాల జల్లు
- హైదరాబాద్ తరహాలో వరంగల్ అభివృద్ధి
- మురికికంపు పోయేలా అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీ
- త్వరలో సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రి పూర్తి
- ఆ బాధ్యత తానే తీసుకుంటానన్న సీఎం

సాక్షిప్రతినిధి, వరంగల్/హన్మకొండ చౌరస్తా/మడికొండ/న్యూశాయంపేట: మడికొండలో బుధవారం సాయంత్రం నిర్వహించిన కాంగ్రెస్ జనజాతర సభ పార్టీ శ్రేణుల్లో జోష్ నింపింది. ఉమ్మడి వరంగల్ జిల్లా నలుమూలల నుంచి కాంగ్రెస్ అభిమానులు, కార్యకర్తలు తరలివచ్చారు. మూడు గంటల నుంచి సభాస్థలికి ప్రజలు గుంపులుగా చేరుకున్నారు. సాయంత్రం 6.30 గంటల వరకు సాగిన సభలో సీఎం రేవంత్‌రెడ్డి ప్రసంగం కార్యకర్తలో కొత్త ఉత్సాహం తెచ్చింది. ఓరుగల్లు చారిత్రక నేపథ్యం, ఉద్యమాల ప్రస్థానం, ప్రాశస్త్యాన్ని గుర్తు చేశారు. సభికులకు ఎండదెబ్బ తగలకుండా ప్రాంగణంలో స్ప్రింక్లర్లతో కూడిన ఫ్యాన్లను ఏర్పాటు చేశారు.

సీఎం పర్యటన సాగిందిలా..

టీపీసీసీ చీఫ్, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రోడ్డు మార్గంలో హైదరాబాద్ నుంచి మడికొండకు వచ్చారు. జనజాతర బహిరంగ సభ వేదికపై సాయంత్రం 5.19 గంటలకు చేరుకున్నారు.



ప్రజలకు అభివాదం చేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి, పక్కన ఎమ్మెల్యేలు నాయిని, కేఆర్ నాగరాజు, అభ్యర్థి కడియం కావ్య

కడియం కావ్యతో కలిసి సీఎం రేవంత్‌రెడ్డి వేదిక నుంచి ప్రజలకు అభివాదం చేస్తూ పరిచయం చేశారు. సుమారు గంటపాటు.. 6.18 గంటల వరకు మంత్రులు, ఎమ్మెల్యేలు, అభ్యర్థి కడియం కావ్య మాట్లాడారు. 6.19 గంటలకు ప్రసంగాన్ని ప్రారంభించిన సీఎం రేవంత్ రెడ్డి 6.49 గంటలకు ముగించారు. వేదికపైన ఉన్న మంత్రులు, ఎమ్మెల్యేలకు ధన్యవాదాలు తెలిపి 7.05 గంటలకు వేదిక దిగి ప్రత్యేక కాన్వాయి ద్వారా హైదరాబాద్‌కు బయలుదేరారు. బహిరంగసభలో ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి రోహిత్ చౌదరి, మంత్రులు డి.శ్రీధర్‌బాబు, కొండా సురేఖ, ధనసరి సీతక్క, వేం నరేందర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు రేవూరి ప్రకాశ్‌రెడ్డి, కడియం శ్రీహరి, కేఆర్ నాగరాజు, మామిడాల యశస్విని రెడ్డి, వరంగల్ పార్లమెంట్ అభ్యర్థి కడియం కావ్య, ఎర్రబెల్లి స్వర్ణ, కూచన రవళిరెడ్డి, బొమ్మనపల్లి అశోక్‌రెడ్డి, ఈవీ శ్రీనివాస్‌రావుల తో పాటు పలువురు పాల్గొన్నారు.

ప్రజాప్రతినిధులకు ప్రశంసలు.. వరంగల్‌పై వరాల జల్లు..

సభలో కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు, కార్యకర్తలపై ప్రశంసలు కురిపించారు. సమ్మక్క, సారలమ్మ వారసులుగా అండగా నిలబడిన మంత్రులు ధనసరి సీతక్క, కొండా సురేఖ పని తీరును కొనియాడుతూ అదే ఖాతాలో కావ్యను చేర్చాలన్నారు. ఓరుగల్లు ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు ప్రాజెక్టులు, ఐటీ పురోగతితోపాటు హైదరాబాద్, వరంగల్, రామగుండం జాతీయ రహదారిని ఇండస్ట్రియల్ కారిడార్‌గా మార్చి పరిశ్రమల కల్పనతో నిరుద్యోగ యువతకు ఉపాధి, ఉద్యోగ కల్పన కోసం ప్రత్యేక చర్యలు చేపడుతామన్నారు. వరంగల్‌లో వర్షాకాలం వస్తే సముద్రం తలపించేలా మురికికంపు గోసను రూపుమాపేందుకు అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీ నిర్మించి కాకతీయ సామ్రాజ్యానికి మరోసారి వన్నె తెచ్చేలా పురోగతి సాధిస్తామన్నారు. మున్సిపల్ శాఖ తన పరిధిలో ఉన్నందున ఎన్నికలు కాగానే తానే స్వయంగా వచ్చి వరంగల్ సమస్యను పరిష్కరిస్తామన్నారు. కడియం శ్రీహరిని కాంగ్రెస్‌లోకి తానే స్వయంగా ఆహ్వానించానని సీఎం స్పష్టం చేశారు.

కేయూను ప్రక్షాళన చేస్తాం..

కాకతీయ విశ్వవిద్యాలయం నిర్వీర్యమైందని, రాబోయే రోజుల్లో కొత్త వైస్ చాన్స్‌లర్, అధ్యాపక బృందాన్ని నియమించి, పేదలకు ఉన్నత విద్య అందేలా ప్రక్షాళన చేస్తామని రేవంత్‌రెడ్డి అన్నారు. ఆ విద్యాశాఖ తన దగ్గరే ఉందని పేర్కొన్నారు. అదేవిధంగా అర్ధంతరంగా నిలిచిన సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిని పూర్తి చేసి ఇక్కడి ప్రజలు వైద్యానికి హైదరాబాద్‌కు రాకుండా చేస్తామన్నారు.

ఎవరెవరు ఏమన్నారంటే..

- మంత్రి సీతక్క మాట్లాడుతూ పుడితే పన్ను, చస్తే పన్నులు వసూలు చేసి ప్రజల నుంచి దోచుకుతిన్న చరిత్ర మోదీ సర్కార్‌దే అని పేర్కొన్నారు.
- మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో ఎర్రబెల్లి దయాకర్‌రావు, గండ్ర రమణారెడ్డి, చల్లా ధర్మారెడ్డి, అరూరి రమేశ్ చేసిన అక్రమాలను వెలికితీయడంతోపాటు ఊచలు లెక్కపెట్టించాలని సీఎం రేవంత్‌రెడ్డిని కోరారు.
- మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ మతాలను అడ్డుపెట్టుకుని బీజేపీ పాలన చేస్తోందని, వచ్చే ఎన్నికల్లో రాహుల్‌గాంధీ ప్రధాని కావడం ఖాయం అన్నారు.
- టీజేఎస్ అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం మాట్లాడుతూ ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం, రాజ్యాంగానికి రక్షణ కావాలంటే కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ గెలవాలని పేర్కొన్నారు.
- వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ బీఆర్‌ఎస్ హయాంలో నగరంలో నాలాలు కబ్జాకు గురయ్యాయని తెలిపారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన మూడు నెలల్లోనే సీఎంతో మాట్లాడి నయీంనగర్ నాలా విస్తరణకు రూ.100 కోట్లను విడుదల చేయించానన్నారు.
- వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు మాట్లాడుతూ వరంగల్ బీఆర్‌ఎస్ అభ్యర్థి సుధీర్‌కుమార్ ఒక డమ్మీ అని, ఆ పార్టీ బీజేపీకి మద్దతు ఇస్తోందని తెలిపారు.
- ఎంపీ అభ్యర్థి కడియం కావ్య మాట్లాడుతూ ప్రజలు ఆలోచించి పార్లమెంట్ అభ్యర్థిగా ఉన్న తనను అత్యధిక మెజార్టీతో గెలిపిస్తే వరంగల్ నగరాన్ని మరింత అభివృద్ధి చేస్తానన్నారు.

28న కేసీఆర్ రోడ్‌షో



హనుమకొండ చౌరస్తాలో స్థలాన్ని పరిశీలిస్తున్న నాయకులు

హన్మకొండ : పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా బీఆర్‌ఎస్ అధినేత చంద్రశేఖర్‌రావు ఈ నెల 28న వరంగల్ మహానగరంలో పర్యటించనున్నారు. ఈ నేపథ్యంలో బీఆర్‌ఎస్ నాయకులు బుధవారం హనుమకొండలోని అంబేద్కర్ కూడలి, పెట్రోల్‌పంపు కూడలి, హనుమకొండ చౌరస్తాను పరిశీలించారు. పర్యటనలో భాగంగా కేసీఆర్ రోడ్‌షో నిర్వహించనున్నారు. ఎమ్మెల్సీలు బస్వరాజు సారయ్య, పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, బీఆర్‌ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్, మాజీ ఎమ్మెల్యేలు గండ్ర వెంకటరమణారెడ్డి, చల్లా ధర్మారెడ్డి, నరేందర్, కార్పొరేషన్ మాజీ చైర్మన్లు నాగుర్ల వెంకటేశ్వర్లు, బొల్లం సంపత్‌కుమార్, మెట్టు శ్రీనివాస్, వాసుదేవరెడ్డి తదితరులు కార్నర్ మీటింగ్ జరిగే స్థలాలను పరిశీలించారు.

కళలపై ఆసక్తి పెంపొందించుకోవాలి

- ఎంజేపీ గురుకుల పాఠశాలల హనుమకొండ డీసీఓ సరిత
- కమలాపూర్‌లో స్టేట్ లెవెల్ ఫైన్ ఆర్ట్స్ శిబిరం ప్రారంభం



శిబిరంలో మాట్లాడుతున్న ఇన్‌చార్జ్ ఆర్సీఓ సరిత

కమలాపూర్ : విద్యార్థులు చదువుతోపాటు కళలపై ఆసక్తిని పెంపొందించుకోవాలని మహాత్మా జ్యోతిరావుపూలే వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల పాఠశాలల ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జ్ ఆర్సీఓ, హనుమకొండ డీసీఓ ఎం.సరిత సూచించారు. కమలాపూర్‌లోని ఎంజేపీ బాలికల గురుకుల పాఠశాలలో ఏర్పాటు చేసిన స్టేట్ లెవెల్ ఫైన్ ఆర్ట్స్ శిబిరాన్ని బుధవారం రాత్రి ఆమె ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులల్లో ప్రతిభకు కొదువలేదని, వీరు ఎందులోనూ తీసిపోరని అన్నారు. విద్యార్థుల్లో కళా నైపుణ్యాలను మరింత మెరుగుపర్చుకోవడానికి ఇలాంటి శిబిరాలు ఎంతగానో దోహదపడుతాయని అభిప్రాయపడ్డారు. విద్యార్థులు ఇలాంటి శిబిరాలను సద్వినియోగం చేసుకుని ప్రతిభ చాటాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంజేపీ బాలుర, బాలికల గురుకుల పాఠశాలల ప్రిన్సిపాళ్లు ఓదెల మల్లయ్య, ప్రఫుల్లాదేవి, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ రేవతి, రాష్ట్రంలోని పలు జిల్లాల ఎంజేపీ గురుకుల పాఠశాలల ప్రిన్సిపాళ్లు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేటితో ముగియనున్న దరఖాస్తుల గడువు

వరంగల్ స్పోర్ట్స్ : జిల్లా స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో నిర్వహించనున్న వేసవి క్రీడాశిక్షణ శిబిరాల దరఖాస్తుల గడువు గురువారం ముగియనున్నట్లు డీవైఎస్‌ఓ గుగులోత్ అశోక్‌కుమార్ తెలిపారు. అనుభవజ్ఞులైన స్పోర్ట్స్ అథారిటీ కోచ్‌లు, సీనియర్ క్రీడాకారుల ద్వారా నిర్వహించనున్న ఈ వేసవి క్రీడాశిక్షణ శిబిరాలను ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. ఆసక్తిగల విద్యార్థులు ఈనెల 25వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు జేఎన్‌ఎస్‌లో ఆధార్, స్టడీ సర్టిఫికెట్లను అందజేసి పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు 9441086556, 9010002889, 9392015280 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

నేటి నుంచి ఓటరు స్లిప్పుల పంపిణీ



హన్మకొండ అర్బన్ : లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో గురువారం నుంచి బీఎల్వోలు ఓటరు స్లిప్పులు పంపిణీ చేయాలని హనుమకొండ అదనపు కలెక్టర్ ఎ.వెంకట్‌రెడ్డి అన్నారు. కలెక్టరేట్‌లో పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని బీఎల్‌ఓలకు ఓటరు స్లిప్పుల పంపిణీపై బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మే 8 వరకు ఓటర్లకు స్లిప్పులు అందించాలని సూచించారు. అనంతరం బీఎల్‌ఓలకు ఓటరు స్లిప్పులు అందజేశారు. సమావేశంలో వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఏఆర్వో, హనుమకొండ ఆర్డీఓ వెంకటేష్, హనుమకొండ కాజీపేట తహసీల్దార్లు విజయ్‌కుమార్, భావ్‌సింగ్, పాల్గొన్నారు.

బాలురకంటే బాలికలదే పైచేయి

- ఇంటర్ ఫలితాల్లో హనుమకొండ జిల్లా 6వ స్థానం
- ఫస్టియర్‌లో 62.41శాతం.. సెకండియర్‌లో 73.23శాతం ఉత్తీర్ణత
- వరంగల్ జిల్లాలో ఫస్టియర్‌లో 51.94 శాతం, సెకండియర్‌లో 62.27 శాతం

- వివరాలు IIలో▸

నేటితో నామినేషన్ల దాఖలు పూర్తి

- వరంగల్‌లో బుధవారం 8 సెట్లు..


నామినేషన్ దాఖలు చేస్తున్న బీజేపీ అభ్యర్థి అరూరి రమేష్


నామినేషన్ పత్రాలు అందజేస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి కడియం కావ్య

వరంగల్: వరంగల్ ఎస్సీ పార్లమెంట్ స్థానానికి నామినేషన్ల దాఖలు చేసే గడువు గురువారం మధ్యాహ్నం 3 గంటలతో ముగియనుంది. బుధవారం బీజేపీ అభ్యర్థిగా అరూరి రమేష్.. రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్యకు ఒక సెట్ నామినేషన్ దాఖలు చేశారు. బీఆర్ఎస్ అభ్యర్థి మారేపల్లి సుధీర్‌కుమార్ తరఫున నాయకులు నయీమొద్దీన్, ఇండ్ల నాగేశ్వర్‌రావు చెరో సెట్ నామినేషన్ దాఖలు చేశారు. స్వతంత్ర అభ్యర్థులుగా చిలివేరు ప్రతాప్, కొయ్యడ నరేష్, పైతారా అత్యుట్, తాటికాయల సతీష్ ఒక్కో సెట్ నామినేషన్ పత్రాలు దాఖలు చేశారు. కాంగ్రెస్ అభ్యర్థిగా కడియం కావ్య మరో సెట్ నామినేషన్ పత్రాలు రిటర్నింగ్ అధికారి పి. ప్రావీణ్యకు అందజేశారు. కార్యక్రమంలో మంత్రి కొండా సురేఖ, ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, రేవూరి ప్రకాశ్‌రెడ్డి, బీజేపీ నాయకులు మార్తినేని ధర్మారావు, రావు పద్మ, గంట రవికుమార్, డాక్టర్ కాళీప్రసాద్ పాల్గొన్నారు.

సాక్షి తెలంగాణ ఎలక్షన్ 2024

మానుకోటలో ఆరో రోజు ఏడు నామినేషన్లు..

- ఇప్పటి వరకు 20 మంది అభ్యర్థులు.. 31 సెట్లు..

మహబూబాబాద్ : మానుకోట పార్లమెంట్ నియోజకవర్గానికి ఆరో రోజు బుధవారం ఏడు నామినేషన్లు.. 12 సెట్లు దాఖలైనట్లు అధికారులు తెలిపారు. కలెక్టరేట్‌లోని రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో అభ్యర్థులు ఆర్వో అద్వైత్ కుమార్‌సింగ్‌కు నామినేషన్ పత్రాలు అందజేశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడుకు చెందిన పాయం శింగరాజు, అదే జిల్లా పాల్వంచకు చెందిన సోయం కన్నరాజు, వరంగల్ జిల్లా ఖానాపురం మండలం నుంచి జర్పుల లింగ్యా, బీఎస్పీ నుంచి గుగులోత్ శేఖర్ రెండు సెట్లు, కురవి మండలం తాట్యా తండాకు చెందిన జాటోత్ చక్రవర్తి స్వతంత్ర అభ్యర్థులుగా నామినేషన్ దాఖలు చేశారు. మరిపెడకు చెందిన బానోత్ లింగ్యా బ్లూ ఇండియా పార్టీ నుంచి నామినేషన్‌వేయగా, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరుకు చెందిన వెంకటేశ్వర్లు గోడు వాన దండకారణ్య పార్టీ నుంచి రెండు సెట్ల నామినేషన్ వేసినట్లు అధికారులు పేర్కొన్నారు. ఇంతకు ముందు నామినేషన్ వేసిన కాంగ్రెస్ అభ్యర్థి పోరిక బలరాంనాయక్, స్వతంత్ర అభ్యర్థి మైపాతి అరుణ్‌కుమార్, స్వతంత్ర అభ్యర్థి బానోత్ లింగ్యా మరో సెట్ నామినేషన్ వేశారు. ఈనెల 24వ తేదీన (బుధవారం) 12సెట్లు దాఖలు కాగా ఇప్పటి వరకు 20 మంది అభ్యర్థులు 31 సెట్లు దాఖలు చేశారని అధికారులు పేర్కొన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు, ఏఆర్వోలు ఎం డేవిడ్, లెనిన్ వత్సల్ టొప్పో తహసీల్దార్లు పాల్గొన్నారు.


నామినేషన్ వేస్తున్న బీఎస్పీ అభ్యర్థి శేఖర్

నేటి నుంచి పలు రైళ్ల హాల్టింగ్ రద్దు

కాజీపేట రూరల్ : రైల్వే ఇంజనీరింగ్ బ్లాక్‌తో ఉప్పల్ రైల్వే స్టేషన్ అప్‌లైన్ డైరెక్షన్‌లో ఏప్రిల్ 25వ తేదీ నుంచి 27వ తేదీ వరకు పలు రైళ్ల హాల్టింగ్‌ను తాత్కాలికంగా రద్దు చేసినట్లు రైల్వే అధికారులు బుధవారం తెలిపారు.

హాల్టింగ్ రద్దయిన రైళ్ల వివరాలు..

- కాజీపేట–సిర్పూర్ (17003) రామగిరి, హైదరాబాద్–సిర్పూర్‌కాగజ్‌నగర్ (17011) ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్
- భద్రాచలంరోడ్–బల్లార్షా (17033) సింగరేణి, సికింద్రాబాద్–సిర్పూర్‌కాగజ్‌నగర్ (12757) ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్
- సికింద్రాబాద్–సిర్పూర్‌కాగజ్‌నగర్ (17233) భాగ్యనగర్ ఎక్స్‌ప్రెస్ ఉప్పల్ అప్‌లైన్‌లో బల్లార్షా వైపు వెళ్లేటప్పుడు హాల్టింగ్‌ను రద్దు చేసినట్లు, డౌన్‌లో కాజీపేట వైపునకు వెళ్తున్నప్పుడు హాల్టింగ్ సౌకర్యం యథావిధిగా ఉంటుందని అధికారులు తెలిపారు.

నేటి నుంచి బావుపేట, దండేపల్లి రైల్వే గేట్ల మూసివేత

ఇంజనీరింగ్ బ్లాక్, మూడో రైల్వేలైన్ పనులతో హసన్‌పర్తి–ఉప్పల్ రైల్వే స్టేషన్ మధ్య ఉన్న దండేపల్లి, బావుపేట రైల్వే గేట్లను మూసివేస్తున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. 25న 11వ నంబర్ రైల్వే గేట్, 26న బావుపేట 9వ నంబర్ రైల్వే గేట్, 27న 8వ నంబర్ రైల్వే గేట్‌ను మూసివేస్తున్నట్లు పేర్కొన్నారు. పాదచారులు, వాహనదారులు రద్దు చేసిన తేదీల్లో వేరే మార్గాల నుంచి ప్రయాణించి రైల్వే అభివృద్ధికి సహకరించాలని కోరారు.

జిజ్ఞాస పోటీల్లో కేడీసీ ప్రాజెక్టుకు బహుమతి

విద్యారణ్యపురి : హైదరాబాద్‌లో కళాశాల విద్య కమిషనరేట్ ఇటీవల రాష్ట్రస్థాయి జిజ్ఞాస స్టడీ ప్రాజెక్టుల పోటీలు నిర్వహించింది. హనుమకొండ కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన ఐదుగురు ఇంగ్లిష్ విభాగం విద్యార్థులు, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ రాంభాస్కర్‌రాజు రూపొందించిన స్టడీ ప్రాజెక్టు ద్వితీయ బహుమతి సాధించిందని ప్రిన్సిపాల్ జి.రాజారెడ్డి బుధవారం తెలిపారు. 2013 సంవత్సరానికి సాహిత్యంలో నోబెల్ బహుమతి పొందిన నార్వేజియన్ రచయిత జాన్‌ఫొసే ఎంపికకు కారణమైన సాహిత్య రచనల విశిష్టతపై రాంభాస్కర్‌రాజు పర్యవేక్షణలో విద్యార్థులు పుట్టా రమేష్, నేహా, గండ్ల పల్లవి, సాత్విక ప్రాజెక్టు తయారు చేశారు.

సాక్షి క్లాసిఫైడ్స్

REAL ESTATE

HOUSE FOR SALE

■ ములుగు రోడ్ KSR గార్డెన్స్ ఆర్చి మేన్ రోడ్ 2nd బిట్ 300 గజాల స్థలంలో గల G+1 ఇండిపెండెంట్ ఇల్లు అమ్మకమునకు కలదు. నో బ్రోకర్స్. సెల్: 7013069889, 7036805586. [W-1264940]

SERVICES

BUSINESS

■ స్త్రీ/పు. అవకాశం తక్కువ పెట్టుబడితో 25 రకాల వెజ్–నాన్ వెజ్ వచ్చళ్ళు షాపుని మీ ఏరియాలో స్థాపించి నెలకు 30 వేలు ఆపైన ఆదాయం పొందండి. 8143909459. [W-1264887]

BUSINESS OFFER

■ ప్రముఖ కంపెనీలో పనిచేయుటకు మంచి కమ్యూనికేషన్ స్కిల్స్ కలిగిన వారు Agentsగా కావలెను. Ph: 7988242391 [H-778707]

■ ద్వారకా ఎంటర్‌ప్రైజెస్ పేపర్ ప్లేట్స్ & LED మిషిన్స్‌పై ప్రతినెల అధిక ఆదాయం, అద్భుత అవకాశం, ఉచిత ముడి పదార్థాలు, 100% తిరిగి కొనుగోలు. 9310515624, 8800496710 [G-1468]

WANTED

■ హన్మకొండ, వరంగల్ లోకల్ పనిచేయుటకు సెక్యూరిటీ గార్డ్స్, సూపర్‌వైజర్స్ అర్జెంటుగా కావలెను. జీతం: 12000 - 14000. సెల్: 8688072125. [W-1264962]

■ Wanted PRO's for Degree College admissions (22 years Experience College) Contact: Cell: 8121554649. [WA-13946]

తాజా వార్తల కోసం లాగిన్ అవ్వండి www.sakshi.com

■ ప్రముఖ కంపెనీలో పార్ట్ టైం మాన్యువల్ రైటింగ్ వర్క్ చేయుటకు స్త్రీ/పు కావలెను. వీక్లీ పేమెంట్స్ 3500/- మీ పేరు, అడ్రస్ కాల్/ వాట్సప్ చేయగలరు. 90596 63584, 95026 15217 [M-1185048]

■ హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఉచిత వసతి + భోజనం జీ: 18K. Ph: 9640258899/ 9640468899 [H-799871]

4 లైన్ల క్లాసిఫైడ్ ప్రకటన 260/- రూ॥ అదనపు లైను 60/- రూ॥ మాత్రమే 5% GST అదనము

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకై సంప్రదించండి

హన్మకొండ	9010144453
వరంగల్	9705748198
నర్సంపేట	9553955722
జనగామ	9951602871
మహబూబాబాద్	9010144453
పరకాల	9010299096
జయశంకర్ భూపాలపల్లి	9705748198

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు.

బాలురకంటే .. బాలికలదే పైచేయి

ఇంటర్ ఫలితాల్లో హనుమకొండ జిల్లా 6వ స్థానం

- ఫస్టియర్‌లో 62.41శాతం.. సెకండియర్‌లో 73.23శాతం ఉత్తీర్ణత
- వరంగల్ జిల్లాలో ఫస్టియర్‌లో 51.94 శాతం, సెకండియర్‌లో 62.27 శాతం

విద్యారణ్యపురి: ఇంటర్ ఫలితాలను బుధవారం విడుదల చేశారు. గత ఏడాదితో పోలిస్తే హనుమకొండ జిల్లాలో ఈ ఏడాది ఉత్తీర్ణతాశాతం తగ్గింది. బాలురకంటే బాలికలదే పైచేయిగా ఉంది. ఇంటర్ ఫస్టియర్ జనరల్ విభాగంలో మొత్తంగా 18,553 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా 11,578మంది ఉత్తీర్ణత(62.41శాతం) సాధించారు. 9,648మంది బాలురు పరీక్షలు రాయగా 5,654మంది (55.49శాతం) పాసయ్యారు. బాలికలు 8,905మంది పరీక్షలకు హాజరుకాగా 6,224మంది ఉత్తీర్ణత (69.89శాతం)సాధించారు. గత ఏడాదికంటే 5.59శాతం ఉత్తీర్ణత తగ్గింది. దీంతో ఫలితాల్లో రాష్ట్ర స్థాయిలో హనుమకొండ జిల్లా ఆరవ స్థానంలో నిలిచింది.

ఒకేషనల్ కోర్సుల్లో 59.69శాతం ఉత్తీర్ణత

ఫస్టియర్ ఒకేషనల్ కోర్సుల్లో 975మంది విద్యార్థులకు 582మంది (59.69శాతం) పాసయ్యారు. బాలురు 451మంది పరీక్షల రాయగా 231మంది (51.22శాతం), బాలికలు 524 మందికిగాను 351మంది (66.98శాతం) ఉత్తీర్ణత సాధించారు. ఇందులోనూ బాలురకంటే బాలికలే అధికంగా ఉత్తీర్ణత సాధించారు.

తగ్గుతూ..పెరుగుతూ..

గత కొన్నిసంవత్సరాలుగా జిల్లాలో ఇంటర్ ఫస్టియర్‌లో ఉత్తీర్ణతను పరిశీలిస్తే 2016లో అతితక్కువగా 48శాతమే కాగా క్రమక్రమంగా 2020వరకు పెరుగుతూ 67శాతం వరకు వచ్చింది. 2021లో 51శాతానికి పడిపోయి మళ్లీ 2022లో 74శాతం ఉత్తీర్ణత సాధించింది. గత ఏడాది 68 శాతంకాగా, ఈ ఏడాది 62.41శాతం ఉత్తీర్ణత సాధించారు.

సెకండియర్‌లో 73.23శాతం ఉత్తీర్ణత

ఇంటర్ సెకండియర్ ఫలితాల్లో హనుమకొండ జిల్లాలో బాలురకంటే బాలకలదే హవా కొనసాగింది. జనరల్ విభాగంలో 73.23 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. గత ఏడాది కూడా 73శాతం మంది ఉత్తీర్ణత సాధించారు. జనరల్ విభాగంలో 16,918మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా, 12,389మంది ఉత్తీర్ణత (73.23శాతం) సాధించారు. బాలురు 8,685మందికిగాను 5,909మంది (68.04శాతం) పాసయ్యారు. బాలికలు 8,233మందికిగాను 6,480మంది ఉత్తీర్ణత (78.71శాతం) సాధించారని డీఐఈఓ ఎ.గోపాల్ తెలిపారు. ఫలితాల్లో జిల్లా రాష్ట్రంలో ఆరవ స్థానంలో నిలిచింది. ప్రైవేట్‌గా జనరల్ విభాగంలో 1451 మంది విద్యార్థులకు 432మంది ఉత్తీర్ణత(29.79శాతం) సాధించారు.

ఒకేషనల్ కోర్సుల్లో 71.92శాతం ఉత్తీర్ణత

సెకండియర్ ఒకేషనల్ కోర్సుల్లో 894మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 643మంది ఉత్తీర్ణత (71.92శాతం)సాధించారు. బాలురు 397మందికిగాను 265మంది (66.75శాతం) పాసయ్యారు. బాలికలు 497మందికి గాను 378మంది (76.06శాతం)ఉత్తీర్ణత సాధించారు. గత ఏడాది 74శాతం ఉత్తీర్ణత సాధించగా ఈ ఏడాది 2.8శాతం తగ్గింది. ఒకేషనల్ కోర్సుల్లో ప్రైవేట్‌గా 57మంది హాజరుకాగా 34మంది ఉత్తీర్ణత(59.65శాతం) సాధించారు.

- ఖిలా వరంగల్‌కు చెందిన మట్టెవాడ సుదీక్ష ఎంపీసీ విభాగంలో 993 మార్కులు సాధించింది.
- హనుమకొండలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థి సందేష్ హెచ్‌సీఈసీ విభాగంలో 1000 మార్కులకుగాను 974మార్కులు సాధించాడు.
- కమలాపూర్‌లోని కేజీబీవీ విద్యార్థిని ఫస్టియర్(ఎంపీసీ)లో 467/470 మార్కులు సాధించి స్టేట్ టాపర్‌గా నిలిచింది.


మట్టెవాడ సుదీక్ష


మార్త పావని


సందేష్

వరంగల్ జిల్లాలో బాలికలదే పైచేయి..

సాక్షి, వరంగల్ : ఇంటర్‌లో వరంగల్ జిల్లాలో బాలికలే పైచేయి సాధించారు. మొదటి సంవత్సరంలో బాలికలు 63.12 శాతం, బాలురు 35.77 శాతం ఉత్తీర్ణత సాధించారు. రెండో సంవత్సరంలో బాలికలు 72.67 శాతం, బాలురు 46.76 శాతం మంది ఉత్తీర్ణత సాధించారు. మొదటి సంవత్సరంలో 24వ స్థానం, ద్వితీయ సంవత్సరంలో 26వ స్థానం దక్కింది.

ఫస్టియర్‌లో 51.94 శాతం, సెకండియర్‌లో 62.27 శాతం

ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం పరీక్షలకు జనరల్ విభాగంలో 5,123 మంది హాజరుకాగా 2,661 మంది (51.94 శాతం) ఉత్తీర్ణులయ్యారు. ఒకేషనల్ విభాగంలో 784 మందికి 391 మంది (49.87 శాతం) ఉత్తీర్ణులయ్యారు. అదేవిధంగా రెండో సంవత్సరం జనరల్ విభాగంలో 5,073 మంది హాజరుకాగా 3,159 మంది (62.27 శాతం) ఉత్తీర్ణత సాధించారు. ఒకేషనల్ విభాగంలో 841 మంది హాజరైతే 517 మంది (61.47 శాతం) ఉత్తీర్ణులయ్యారు. రెండో సంవత్సరం జనరల్ ప్రైవేట్ ఉత్తీర్ణత శాతంలో వరంగల్ 29వ స్థానంలో ఉంది. 954 మంది హాజరుకాగా 235 మంది (24.63 శాతం) ఉత్తీర్ణత సాధించారు. ఒకేషనల్ రెండో సంవత్సరం ప్రైవేట్ విభాగంలో 90 మంది హాజరైతే 38 మంది (42.22 శాతం) ఉత్తీర్ణులయ్యారు.

గురుకులాల్లో ఉత్తమ ఫలితాలు

విద్యారణ్యపురి : ఇంటర్‌లో తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలు ఉత్తమ ఫలితాలు సాధించాయి. హనుమకొండ జిల్లా మడికొండలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలో చదివిన ఎం.రక్షిత ఎంపీసీలో 1000 మార్కులకు 990 మార్కులు, పూజిత బైపీసీలో 1000 మార్కులకు 986 మార్కులు సాధించారని వరంగల్ ఆర్సీఓ విద్యారాణి, గురుకులం ప్రిన్సిపాల్ మల్లారెడ్డి తెలిపారు. మడికొండ, ఎల్కతుర్తి, చిట్యాల బాలికల గురుకులాలు వందశాతం ఫలితాలు సాధించాయని ఆమె పేర్కొన్నారు. వరంగల్ రీజియన్‌లోని హనుమకొండ, వరంగల్, భూపాలపల్లి, ములుగు జిల్లాల్లో 19 గురుకుల కళాశాలలు ఉన్నాయి. ఇంటర్ ఫస్టియర్‌లో 1,150 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా 954 మంది ఉత్తీర్ణత సాధించారని విద్యారాణి తెలిపారు. ఇంటర్ సెకండియర్‌లో 1,148 మందికి 1,004 మంది విద్యార్థులు (87.4 శాతం) ఉత్తీర్ణత సాధించారు.


రక్షిత, 990 మార్కులు


పూజిత, 986 మార్కులు

బీసీ గురుకులాల్లో..


బండి రిషిత, 990 మార్కులు


ఎస్.అర్చన, 983 మార్కులు

విద్యారణ్యపురి : ఉమ్మడి వరంగల్ జిల్లాలోని తెలంగాణ మహాత్మాజ్యోతిరావు పూలే బీసీ గురుకులాల్లో ఇంటర్ ఫస్టియర్‌లో 75.14 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. శాయంపేట, పెద్దాపూర్, తిమ్మాపూర్, కమలాపూర్, కాజీపేట, హనుమకొండ, ఐనవోలు, వర్ధన్నపేట, ఖిలావరంగల్, వరంగల్, నెక్కొండ, నల్లబెల్లి, సంగెం, దంతాలపల్లి, గుమ్ముడూరు, పెద్ద వంగర, మరిపెడ, భూపాలపల్లి, గాంధీనగర్, మొండ్రాయి, బచ్చన్నపేట, రఘునాథపల్లి, స్టేషన్‌ఘన్‌పూర్, పాకాల కొత్తగూడ, వెంకటాపూర్‌లోని బీసీ గురుకులాల నుంచి 1605 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. అందులో 1206 మంది ఉత్తీర్ణత (75.14 శాతం) ఉత్తీర్ణత సాధించారని బీసీ గురుకులాల రీజినల్ కోఆర్డినేటర్ మనోహర్‌రెడ్డి తెలిపారు. గాంధీనగర్ బాలికల గురుకులంలో 98.3 శాతం, వెంకటాపూర్ బాలుర గురుకులంలో 93.1 శాతం ఉత్తీర్ణత సాధించారు. ఇంటర్ సెకండియర్‌లో 956 మందికి 830 మంది విద్యార్థులు (86.82 శాతం) ఉత్తీర్ణత సాధించారని ఆయన పేర్కొన్నారు.

వరంగల్ బాలుర గురుకులంలో..

వరంగల్ బాలికల బీసీ గురుకులంలో బండి రిషిత బైపీసీ సెకండియర్‌లో 1000 మార్కులకు 990 మార్కులు సాధించింది. మరిపెడ బీసీ బాలికల గురుకులంలో ఎస్.అర్చన ఎంపీసీలో 1000 మార్కులకు 983 మార్కులు సాధించారని ఆర్సీఓ తెలిపారు.

క్రీడలతో ఆటుపోట్లు తట్టుకునే శక్తి

- కాకతీయ యూనివర్సిటీ వీసీ రమేష్
- 6వ తెలంగాణ హ్యాండ్‌బాల్ హంట్ పోటీలు ప్రారంభం

వరంగల్ స్పోర్ట్స్ : క్రీడలతో జీవితంలో ఎదురయ్యే అనేక ఆటుపోట్లను తట్టుకునే శక్తి లభిస్తుందని కేయూ వీసీ తాటికొండ రమేష్ అన్నారు. హనుమకొండ జేఎన్ఎస్‌లో మూడు రోజులు జరగనున్న 6వ తెలంగాణ రాష్ట్ర హ్యాండ్‌బాల్ హంట్ పోటీలు బుధవారం ప్రారంభమయ్యాయి. అండర్–15 బాలుర విభాగంలో జరగనున్న పోటీలను వీసీ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించిన అనంతరం మాట్లాడారు. క్రీడలతో మానసిక ఒత్తిడి తట్టుకునే శక్తితో పాటు ఉజ్వల భవిష్యత్ ఉంటుందన్నారు. హ్యాండ్‌బాల్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి శ్యామల పవన్‌కుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలోని ఉమ్మడి పది జిల్లాల నుంచి 300 మంది క్రీడాకారులు, టెక్నికల్ అఫిషియల్స్ హాజరైనట్లు తెలిపారు. ఈ పోటీల్లో ప్రతిభ కనబరిచిన 40 మంది క్రీడాకారులను స్పోర్ట్స్ ఎక్సలెన్సీకి పంపిస్తామన్నారు. కార్యక్రమంలో డీవైఎస్ఓ అశోక్, ఒలింపిక్స్ సంఘం జిల్లా కార్యదర్శి కైలాస్‌యాదవ్, కిట్స్ డీన్ రమేష్‌రెడ్డి, వివిధ క్రీడా సంఘాల బాధ్యులు శ్యాం, సదానందం, ప్రవీణ్, ఇంద్రసేనారెడ్డి తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కేయూ వీసీ రమేష్

'సువిద్య' కళాశాల విద్యార్థుల విజయభేరి


పి.శృతి


కె.హరిణి


పి.నిఖిల


బి.అమూల్య


పి.దేవిశ్రీ


కేజియా బ్లేస్సీ


యాస్మిన్

హన్మకొండ: హనుమకొండ నక్కలగుట్టలోని సువిద్య జూనియర్ కళాశాల విద్యార్థినులు ఇంటర్మీడియట్ ఫలితాల్లో విజయభేరి మోగించారని ఆ కళాశాల కరస్పాండెంట్ కె.శ్రీనివాస్ రెడ్డి, డైరెక్టర్లు ఎ.జితేందర్‌రెడ్డి, ఎస్.వెంకట్ రెడ్డి తెలిపారు. ఎంపీసీ ద్వితీయ సంవత్సరంలో పి.శృతి 987 మార్కులు, కె.హరిణి 985, ప్రథమ సంవత్సరంలో పి.దేవిశ్రీ 465, ఎస్.సిరిచందన 465, ఎస్.కేజియా బ్లేస్సీ 465, ఎండి. రోషిని 462 మార్కులు సాధించారని వివరించారు. ద్వితీయ సంవత్సరం బీపీసీలో పి.నిఖిల 976, బి.అమూల్య 973, ప్రథమ సంవత్సరంలో తాంజియా యాస్మిన్‌కు 423 మార్కులు వచ్చాయన్నారు. అధిక మార్కులు సాధించిన విద్యార్థినులను కరస్పాండెంట్, డైరెక్టర్లు, అధ్యాపకులు అభినందించారు.

ఇంటర్ ఫలితాల్లో 'ఎస్ఆర్' విజయభేరి

ఇంటర్ ఫస్టియర్‌లో..


నాగహర్షిత (ఎంపీసీ, 468) | అనూహ్య (ఎంపీసీ, 468) | శరణ్య (ఎంపీసీ, 468)


వినయ్‌కుమార్ (బైపీసీ, 438) | గట్ల శరణ్య (ఎంఈసీ, 495) | స్పందన (సీఈసీ, 493)

సెకండియర్‌లో..


వి.తేజస్విని (బైపీసీ, 992) | చిన్నోళ్ల అక్షిత (బైపీసీ, 990) | తేజస్విని (బైపీసీ, 990)


సీలం నందిత (ఎంపీసీ, 993) | సాయిమణిదీప్ (ఎంపీసీ, 992) | జి.జగదీశ్వర్ (ఎంపీసీ, 991)


కె.అనుదీప్ (ఎంపీసీ, 991) | సీహెచ్ హన్సిక (ఎంపీసీ, 991) | పి.హన్సిక (ఎంపీసీ, 991)

విద్యారణ్యపురి: ఇంటర్మీడియర్ ఫలితాల్లో ఎస్ఆర్ విద్యాసంస్థల విద్యార్థులు విజయభేరి మోగించారని ఆ విద్యాసంస్థల చైర్మన్ ఎ.వరదారెడ్డి, డైరెక్టర్లు మధుకర్‌రెడ్డి, సంతోష్‌రెడ్డి తెలిపారు. ఇంటర్ ఫస్టియర్‌లో ఎంపీసీ విభాగంలో 470 మార్కులకు గాను 468 మార్కులు వచ్చిన విద్యార్థుల వివరాలు ఇలా ఉన్నాయి.. మేడిశెట్టి నాగ హర్షిత , కందుకూరి అనూహ్య, శరణ్యమాసాని, బుసాని రిత్విక్, కె ప్రజ్వలితారెడ్డి, టి తారకరాము, డి మోనాల్, పోగుల ఆశ్రిత్, ఇందూరి రశ్మిత, బైరి శ్రీనిధి, కె హాసిని, విశాల్ సుంకరి, మందల సాయిశ్రీయకు 470 మార్కులకు గాను 468 మార్కుల చొప్పున సాధించారని వారు తెలిపారు. అలాగే, ఎంపీసీ విభాగంలో 470 గాను 467 సాధించిన వారు 49మంది పైగా విద్యార్థులు ఉన్నారని పేర్కొన్నారు. 466 మార్కులు వచ్చినవారు 125 మందికిపైగా ఉన్నారని తెలిపారు. బైపీసీ విభాగంలో440మార్కులకు గాను 438 మార్కులు సాధించినవారు చెన్నవినయ్‌కుమార్, రాథోడ్‌స్నేహ, ఎ వైశాలి ఉన్నారని వివరించారు. ఎంఈసీ విభాగంలో గట్ల శ్రావ్య 500 మార్కులకు గాను 495 మార్కులు సాధించారు. డి భవ్యశ్రీ 494మార్కులు సాధించారు. సీఈసీ విభాగంలో తన్నీరు స్పందన 500 మార్కులకుగాను 493 మార్కులు సాధించారు.హెచ్ తబస్సుమ్, సైదామహీన్ ఫాతిమా 492 మార్కుల చొప్పున సాధించారు. భవిష్యత్‌లో మరింత అత్యుత్తమ మార్కులు సాధించేలా తీర్చిదిద్దుతామని వారు తెలిపారు.

ద్వితీయ సంవత్సరంలో..

ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరంలో ఎంపీసీ విభాగంలో సీలం నందిత (993 మార్కులు), జి.సాయి మణిదీప్‌రెడ్డి (992 మార్కులు), జి.జగదీశ్వర్, కన్నం అనుదీప్, సీహెచ్ హన్సిక, పోలవరపు హన్సిక (991 మార్కులు), ఎం.వైశాలి, వినూత్న నమసాని, తుగాణి ప్రభాస్, కె.సౌమ్య, గుగ్గిళ్ల హర్షిత, ఎస్.వైష్ణవి, సూర నమిత, పెద్దోజు సాయివైష్ణవి (990 మార్కులు) సాధించినట్లు వరదారెడ్డి తెలిపారు. బైపీసీ విభాగంలో వల్లిదాసు తేజస్విని (992 మార్కులు), చిన్నోళ్ల అక్షిత, చీకటిమల్ల తేజస్విని (990 మార్కులు) సాధించినట్లు తెలిపారు.

'ఏకశిల' విద్యార్థుల విజయదుందుభి


విద్యార్థులను అభినందిస్తున్న గౌరు తిరుపతిరెడ్డి

హసన్‌పర్తి: ఇంటర్ ఫలితాల్లో నగరంలోని ఏకశిల జూనియర్ కళాశాల విద్యార్థులు విజయదుందుభి మోగించారు. జూనియర్ ఇంటర్ ఎంపీసీ విభాగంలో జె.లక్ష్మన, బీపీసీ విభాగంలో వి.సంజన, సీనియర్ ఇంటర్ సీఈసీ విభాగంలో ఎస్.కే. హీనా రాష్ట్రస్థాయి ర్యాంకులు సాధించినట్లు ఏకశిల విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ గౌరు తిరుపతిరెడ్డి తెలిపారు. జూనియర్ ఇంటర్ విభాగంలో కళాశాలకు చెందిన జె.లక్ష్మన (467), జి.స్నేహ(467), జె.ప్రతీశ్వర్ (466), జి.వీరేష్(466), సీహెచ్.మేఘన(465), ఎ.వర్ధిన్(465), ఎ. సాహిత్య (465), బీపీసీ విభాగంలో వి.సంజన (436), కె.సాత్విక(436), కె.భవాని(435), సీఈసీ విభాగంలో సుమయ తన్వీర్(485), వి.శ్రీనిత్య(480) మార్కులు సాధించినట్లు తిరుపతిరెడ్డి తెలిపారు. అలాగే, సీనియర్ ఇంటర్ ఎంపీసీ విభాగంలో డి.వర్షిత(988), టి.శ్రీవర్థిని(987), బీపీసీ విభాగంలో డి.సుమన శ్రీ (986), డి.పద్మరేఖ (986), సీఈసీ విభాగంలో ఎస్.కే. హీనా (986) మార్కులు సాధించారు. ఈ సందర్భంగా ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులను అభినందించారు. సమావేశంలో ఏకశిల విద్యాసంస్థల డైరెక్టర్ జితేందర్‌రెడ్డి, ప్రిన్సిపాళ్లు సుధాకర్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, రాజిరెడ్డితో పాటు అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

షైన్ కళాశాల విద్యార్థుల ప్రభంజనం


విద్యార్థులను అభినందిస్తున్న షైన్ విద్యా సంస్థల చైర్మన్ మూగల కుమార్ యాదవ్, డైరెక్టర్లు

హన్మకొండ: ఇంటర్మీడియట్ ఫలితాల్లో హనుమకొండలోని షైన్ జూనియర్ కళాశాల విద్యార్థులు ప్రభంజనం సృష్టించారు. ప్రథమ, ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో రాష్ట్ర స్థాయిలో ఎంపీసీ, బీపీసీలో మొదటి ర్యాంకు సాధించి కార్పొరేట్ సంస్థలకు దీటుగా ఫలితాలు సాధించామని షైన్ విద్యా సంస్థల చైర్మన్ మూగల కుమార్ యాదవ్ తెలిపారు. ఎంపీసీ మొదటి సంవత్సరంలో ఆర్.సంజయ్ 468 మార్కులు, ఎం.వరుణ్ సందేష్ (467), జి.వికాస్ (467), ఏడుగురు విద్యార్థులు 466 మార్కులు, 8 మంది 465 మార్కులు సాధించారని తెలిపారు. బీపీసీ మొదటి సంవత్సరంలో కె.సహస్ర (436), డి.ఇందు (436), వై.చందన (436), ఇ.సాహితి (436), బి.సాయి నివేదిత (436), ఎస్.సాయి ప్రశాంతి (436), ముగ్గురు విద్యార్థులు 435 మార్కులు, మరో ముగ్గురు 434, ఇద్దరు 430 మార్కులు సాధించారని వివరించారు. ద్వితీయ సంవత్సరం ఎంపీసీలో వి.సరయు 992, పి.వేద 987 మార్కులు, ముగ్గురు 986, బీపీసీలో టి.హోమప్రియ 991, బి.శ్రీపూజ 990 మార్కులు సాధించారని వివరించారు. వారితో పాటు ఎంపీసీలో 25 మందికి 925 పైగా మార్కులు, బీపీసీలో 20 మందికి 960కి పైగా మార్కులు వచ్చాయన్నారు. మొదటి సంవత్సరం ఎంపీసీలో 45 మందికి 460కి పైగా మార్కులు, 15 మందికి 430కి పైగా మార్కులు వచ్చాయన్నారు. కార్యక్రమంలో షైన్ విద్యాసంస్థల డైరెక్టర్లు, పి.రాజేంద్రకుమార్, మూగల రమ, జె.శ్రీనివాస్, ఐఐటీ కో ఆర్డినేటర్ మూగల రమేష్, ప్రిన్సిపాళ్లు మారబోయిన రాజుగౌడ్, కొత్తకొండ శ్రీనివాస్ గౌడ్, ప్రవళిక, అధ్యాపకులు పాల్గొన్నారు.

'ఏబీవీ'లో అత్యుత్తమ ఫలితాలు


విద్యార్థులను అభినందిస్తున్న యాజమాన్యం

జనగామ: ఇటర్మీడియట్ ఫలితాల్లో జిల్లా కేంద్రంలోని ఏబీవీ జూనియర్ కళాశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో ప్రభజనం సృష్టించారు. ఫస్టియర్ ఎంపీసీలో కళాశాలకు చెందిన విద్యార్థిని సుమాయా సబ్రిన్ 470 మార్కులకు 468తో స్టేట్ ఫస్ట్ ర్యాంకు సాధించారు. ఇదే కళాశాలకు చెందిన విద్యార్థిని జోయ అంజుం 467 మార్కులతో రాష్ట్రంలో ద్వితీయ స్థానంలో నిలిచింది. మూల శరణ్య, ఇట్టబోయిన అనూష 460 మార్కులతో తృతీయ స్థానం కైవసం చేసుకున్నారు. గ్యాదరి వైష్ణవి 465 మార్కులతో నాలుగో స్థానంలో నిలిచింది. బైపీసీలో సకినాల సంజన, బోయిన అశ్విని 440 మార్కులకు 436తో అగ్రస్థానంలో నిలిచింది. సానియా ఫిర్దోష్ 435 మార్కులు తెచ్చుకుంది. ఒకేషనల్ ఏఎన్‌టీ ఫస్టియర్‌లో ఇండ్ల మహేందర్ 500 మార్కులకు 490, ఎంఎల్‌టీ ఫస్టియర్‌లో గాజుల బద్రీనాథ్ 477, ఎంపీహెచ్‌డబ్ల్యూ కేటగిరీలో 444 మార్కులు సాధించారు. ఎంపీసీ సెకండియర్ సీల చందన 1000 మార్కులకు 985, బైపీసీలో చెన్నోజు దేవీశ్రీ 986, ఒకేషనల్ సెకండియర్ దాసరి శ్రావణి 969 మార్కులు సాధించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ కనకరాజు తెలిపారు. ఇంటర్ ఫస్టియర్‌లో 470 మార్కులకు 460 సాధించినవారు 80 మందికి పైగా ఉన్నారని పేర్కొన్నారు. విద్యార్థులను యాజమాన్యం అభినందించింది.


సబ్రిన్ ఎంపీసీ 468/470

కొనసాగిన 'శివాని' కళాశాల హవా


విద్యార్థులను అభినందిస్తున్న కళాశాల యాజమాన్యం

హసన్‌పర్తి: ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ సంవత్సర ఫలితాల్లో 'శివాని' విద్యార్థుల హవా కొనసాగింది. జూనియర్, సీనియర్ విభాగాల్లో రాష్ట్ర స్థాయి ర్యాంకులు సాధించారు. జూనియర్ ఇంటర్ ఎంపీసీ విభాగంలో చీర్ల షైజా(468), మేడిశెట్టి యశ్వంత్ (467), వేల్పుల అజయ్(467), పూజారి జెమిని(467), కొత్తకొండ ఆకాంక్ష(467), గుగులోత్ తరుణ్(467) మార్కులు సాధించినట్లు శివానీ విద్యాసంస్థల కరస్పాండెంట్ తాళ్లపల్లి స్వామి తెలిపారు. జూనియర్ ఇంటర్ బీపీసీ విభాంలో ఎం.సుష్మిత(436), గుండా హన్సిక(436), కడారి కౌశిక్ (435), ఆరె హాసిని(435), శివానీ(435), కె.జ్యోతిర్మయి(435) మార్కులు సాధించారని తాళ్లపల్లి స్వామి చెప్పారు. సీనియర్ ఇంటర్ ఎంపీసీ విభాగంలో కళాశాలకు చెందిన పి.చైతన్య(989), తిప్పారపు గణేష్(989), రావుల నందిని(989), వెల్దండి హారిక(988), దాసరి శ్వేత(988), బీపీసీ విభాగంలో కంకటి హారిక(981), బక్క సింధు (980) మార్కులతో రాష్ట్రస్థాయి ర్యాంకులు సాధించారని తాళ్లపల్లి స్వామి తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాళ్లు సురేందర్‌రెడ్డి, చంద్రమోహన్, డైరెక్టర్లు రాజు, ఎ.రమేష్, ఎ.మురళీధర్, వి.సురేష్, ఎస్.సంతోష్‌రెడ్డి పాల్గొన్నారు.

స్కూల్లో మ్యాథ్స్ అవర్... సైన్స్ అవర్ అంటుంటాం.
చట్టసభలో జీరో అవర్ అనే మాట వింటుంటాం.
స్టోరీ అవర్... ఈ గంట ఎక్కడ నుంచి వచ్చింది?
నీలిమ పెనుమర్తి ఆలోచన నుంచి వచ్చింది.
రోజుకో గంట కథలు వినమని చెప్తున్నారామె.
యూకేలో ఆచరణలో పెట్టి... ఇండియాకి తెచ్చారు.
విశ్వవ్యాప్తం చేయడానికి కంకణం కట్టుకున్నారు.
ఆడియో బుక్స్‌తో స్వచ్ఛమైన భాష నేర్పిస్తున్నారు.

కథలకో గంట 1/24

నీలిమ చెప్పే కథ చదవండి!


నీలిమ

హైదరాబాద్‌లో పుట్టి పెరిగిన నీలిమ ఉన్నత విద్య కోసం యూకేకి వెళ్లి అక్కడే స్థిరపడ్డారు. పిల్లల పెంపకంలో కథలు కూడా ఒక భాగం అయి తీరాలని నమ్ముతారామె. మనదేశంలో స్కూల్ కరికులమ్‌లో పిల్లలకు కథలు లేకపోవడం విచారకరం అంటారామె. కథ ప్రాధాన్యం తెలిసిన అభివృద్ధి చెందిన దేశాలు పిల్లల రోజువారీ క్రమంలో ఓ గంట కథల కోసం కేటాయిస్తున్నాయని, మన దగ్గర అది లోపించడంతో ఎంత పెద్ద చదువులు చదివినప్పటికీ ఒక విషయాన్ని చక్కగా కళ్లకు కట్టినట్లు వివరించగలిగిన నైపుణ్యం కొరవడుతోందన్నారు నీలిమ. భాష ఏదైనా ఆ భాషలో పదాలను స్పష్టంగా ఉచ్చరించడం అలవాటు చేయాలంటే ఇంట్లో తల్లిదండ్రులు అంత స్వచ్ఛంగా మాట్లాడే నేపథ్యం ఉండాలి. ఆ వెసులుబాటు లేని పిల్లలకు తన ప్రయత్నం మంచి భాషను, చక్కటి భావ వ్యక్తీకరణను నేర్పిస్తుందన్నారు నీలిమ. ఏడేళ్ల కిందట 'స్టోరీ అవర్' ఆలోచనకు బీజం పడిన సందర్భాన్ని 'సాక్షి'తో పంచుకున్నా రామె.

ఓ గంట నిడివిలోనే కథ

''నాకు లండన్ ఇంపీరియల్ కాలేజ్‌లో కెమిస్ట్రీలో ఎంఎస్ చేయడానికి స్కాలర్‌షిప్ వచ్చింది. మా వారు కూడా స్కాలర్‌షిప్ మీద లండన్‌లోనే వచ్చారు. అలా 30 ఏళ్ల కిందట యూకేకి వెళ్లడం, చదువు, ఉద్యోగం, ఇద్దరు పిల్లలతో అక్కడే సెటిలయ్యాం. రెండవసారి గర్భిణిగా ఉన్నప్పుడు పీహెచ్‌డీలో విరామం తీసుకున్నాను. ఆ విరామం నా ఆలోచనలను కథల మీదకు మళ్లించింది. పెద్ద బాబుకి కథలు చెప్పడం మొదలుపెట్టాను. అమరచిత్ర కథ చదవడం అలవాటు చేశాను. అదే చిన్నబాబుకి కూడా అలవడింది. మా అబ్బాయిలిద్దరూ గ్రీక్ పౌరాణిక గ్రంథాలను కూడా చదివారు. వాళ్లిద్దరి మాటల్లో ఆ పాత్రల గురించిన చర్చ వస్తుండేది. అప్పుడు మన రామాయణాన్ని పరిచయం చేశాను. అదే సమయంలో మా పెద్దబ్బాయి స్కూల్ వాళ్లిచ్చిన ప్రాజెక్ట్ కోసం ఒక స్టోరీ బోర్డ్ చేయాల్సి వచ్చినప్పుడు రామాయణం ఇతివృత్తంగా చేశాడు. ఆ తర్వాత పిల్లలకు సెలవుల్లో రామాయణం మీద వాళ్ల వెర్షన్ రాయమని చెప్పాను. ఆ టాస్క్‌లో మరో చాలెంజ్... కథనం గంటకు మించరాదు. తమకు తోచినట్లు ఎడిట్ చేసుకుంటూ సీతారామలక్ష్మణులు యుద్ధం తర్వాత విజేతలై అయోధ్యకు రావడం దీపావళి వేడుక చేసుకోవడంతో ముగింపు ఇవ్వాలన్నమాట. ఆ సాధన ఆడియో బుక్ ఆలోచనకు రూపమిచ్చింది.



సమయం లేని తల్లిదండ్రుల కోసం...

ఇప్పుడు ఉద్యోగాలు దాదాపుగా అందరి జీవితాలనూ సంక్షిప్తంగా మార్చేస్తున్నాయి. ఇలాంటప్పుడు పిల్లలకు కథ చెప్పాలని ఉన్నప్పటికీ కొంతమందికి అందు కోసం ఓ గంట సమయం కేటాయించలేని పరిస్థితి ఉంటోంది. వాళ్లకు ఉపయోగపడేటట్లు కథలకు ఆడియో బుక్ రూపమిచ్చాను. దానిని ఇంగ్లిష్, హిందీ, తెలుగులో తెచ్చాను. మా పిల్లలు శ్రేయాస్, ఆయుర్ ఇద్దరూ హిస్టరీ చదివారు. అక్కడ హిస్టరీ అంటే రష్యన్ విప్లవం, ఫ్రెంచ్ విప్లవం, ప్రపంచ యుద్ధాలు ప్రధానంగా ఉంటాయి. మా పిల్లలు అలాగే యూకేలో ఉన్న భారతీయమూలాలున్న పిల్లలకు మన చరిత్ర తెలియచేయాలనే ఉద్దేశంతో 'ఏ బ్రీఫ్ హిస్టరీ ఆఫ్ ఇండియన్ ఇండిపెండెన్స్ ఫ్రమ్ ద మొఘల్స్ టు ద మహాత్మా' పేరుతో మరో ఆడియో బుక్ చేశాను. ఆ స్టోరీ ఈస్ట్ ఇండియా కంపెనీ మనదేశంలో అడుగు పెట్టడం నుంచి మహాత్మాగాంధీ ఆధ్వర్యంలో స్వాతంత్య్ర సముపార్జన వరకు సాగింది. అలాగే మన సామెతలను పరిచయం చేయడానికి చేసిన ప్రయత్నమే 'తాతమ్మ కథలు'. మా అమ్మ, నాన్న, అత్త, మామగారితో ఒక్కో సామెతకు ఒక్కో కథ రాయించి వాటిని ఐదు నిమిషాలకు మించకుండా ఎడిట్ చేసి రికార్డ్ చేశాను. మొత్తం పన్నెండు కథలు, గంట ఆడియో. ఈ కథలకు నాకు మాల్గుడి డేస్ స్ఫూర్తి. యూకేలోని తెలుగు కుటుంబాల పిల్లలు ఈ కథలను వినడం మొదలు పెట్టిన తర్వాత తొలి రోజుకి పన్నెండవ రోజుకీ వారి ఉచ్చారణ మారిపోయింది. కథకు అంతటి శక్తి ఉంటుందనే నా నమ్మకం నిజమేనని నిరూపితమైంది. తోలుబొమ్మలతో చేసిన ప్రయోగానికి చాలా ఖర్చయింది. కానీ అది కూడా సంతృప్తినిచ్చింది. ఆరు పాత్రలతో కథను అల్లుకుంటూ రాసుకున్నాం. ఆడియో బుక్ అనువాదాలకు హైదరాబాద్‌లోని కేంద్రీయ విద్యాలయ (ఉప్పల్) విద్యార్థులు, బేగంపేటలోని దేవనార్ (అంధ విద్యార్థుల పాఠశాల) స్కూల్ విద్యార్థులు గళమిచ్చారు.

– నీలిమ పెనుమర్తి, స్టోరీ అవర్ రూపకర్త


ఆడియో బుక్‌కి గళం ఇస్తున్న దేవనార్ స్కూల్ విద్యార్థులు ఆదిత్య, అనిల్, రంజిత్ (ఫైల్ ఫొటో)

పిల్లలే పాట రాశారు!

మాల్గుడి డేస్ వీడియోలకు సిగ్నేచర్ ట్యూన్ ఉన్నట్లే మా ఆడియో బుక్స్‌కి కూడా ట్యూన్ ఉండాలని పాట కోసం ప్రయత్నించాను. పిల్లలకు ఇస్తే ఎలా రాస్తారో చూద్దామని యూకేలో శచి అనే అమ్మాయికిచ్చాను. తాను రామాయణం కథను ఒక్క వాక్యంలో 'వారధి నిర్మాణం సీత మీద రాముడికి ఉన్న ప్రేమకు ప్రతిబింబం' అనే భావంతో రాసింది. అలాగే భారతీయ మూలాలు ఏ మాత్రం లేని 'ఎవీ సిమన్స్' అనే అమ్మాయి 'లైట్ ద ల్యాంప్స్' పేరుతో సీతారాములు విజేతలుగా అయోధ్యకు వచ్చి దీపావళి వేడుక చేసుకోవడాన్ని రాసింది. మంథర విషపూరిత వచనాలు ఎంతటి ప్రభావాన్ని చూపిస్తాయో వివరించింది.

క్రియేటివ్‌గా సైన్స్ పాఠాలు

బాల్యంలో మేము బాలానందం వినేవాళ్లం. సరళంగా సాగే కథనాలు పిల్లల్ని అలరించేవి. నా ఆడియోబుక్స్ కూడా సులువుగా ఉంటాయి. ఇవన్నీ 'స్టోరీ అవర్ డాట్ కో డాట్ యూకే' వెబ్‌సైట్‌లో ఉచితంగా ఉన్నాయి. భాష శుద్ధంగా ఉంటే ఆలోచనలు కూడా అంతే శుద్ధంగా ఉంటాయని నా అభిప్రాయం. మంచి భాష మాట్లాడితే వ్యక్తి గౌరవం పెరుగుతుంది. ఉద్యోగం, వ్యాపారాల కోసం ప్రపంచంలో ఎక్కడికెళ్లినా సరే... మంచి భాష ద్వారా చక్కటి అవకాశాలను అందిపుచ్చుకోగలుగుతారు. మంచి ఉచ్చారణ వ్యక్తి గౌరవాన్ని పెంచుతుంది. అందుకే సైన్స్ సబ్జెక్ట్‌ని కూడా ఈ క్రియేటివ్ మీడియం ద్వారా వివరించాలనేది నా ఆకాంక్ష'' అని తన ప్రయత్నం వెనుక ఉన్న పరమార్థాన్ని వివరించారు నీలిమ పెనుమర్తి.

– వాకా మంజులారెడ్డి, సాక్షి ఫీచర్స్ ప్రతినిధి
ఫొటోలు : అనిల్ కుమార్ మోర్ల

వందేళ్ల చరిత్ర ఉన్న అలీగఢ్ ముస్లిం యూనివర్సిటీ
ఎప్పుడూ ఒక మహిళను వైస్ చాన్సలర్‌గా చూడలేదు.
కాని మొదటిసారి ప్రొఫెసర్ నైమా ఖాతూన్‌ను
రాష్ట్రపతి ద్రౌపది ముర్ము వి.సి.గా నియమించారు.
దీంతో నైమా ఖాతూన్ చరిత్ర సృష్టించారు.
ఆమె మైనారిటీ వర్గ మహిళలకు గొప్ప స్ఫూర్తి కాగలదంటూ
శుభాకాంక్షలు వెల్లువెత్తుతున్నాయి. నైమా ఖాతూన్ పరిచయం.

న్యూస్‌మేకర్


ప్రొఫెసర్ నైమా ఖాతూన్

వందేళ్లకు ఆమె వచ్చింది

నైమా ఖాతూన్‌కు ముస్లిం మహిళల చదువు గురించి చాలా పట్టింపు ఉంది.

'ఉత్తరాదిలో నేను ప్రిన్సిపాల్‌గా పని చేసిన అలీగఢ్ విమెన్స్ కాలేజ్ చాలా ముందంజలో ఉంది. అక్కడ మూడు వేల మంది ముస్లిం ఆడపిల్లలు చదువుకుంటున్నారు. కాని ఇదొక్కటే సరిపోదు. ఉత్తరప్రదేశ్, బిహార్‌లలో ముస్లిం బాలికల విద్య చాలా వెనుకబడి ఉంది. దక్షిణాదిలో ముస్లిం సమూహాలు విద్యారంగంలో ముస్లిం బాలబాలికలను ప్రోత్సహిస్తున్నాయి. ఉత్తరాదిలో ఆ పని జరగడం లేదు. రాజకీయ, ఆర్థిక, సామాజిక వెనుకబాటుతనాన్ని జయించాలంటే విద్యార్జనకు మించిన వేరే మార్గమేదీ లేదు' అంటుందామె.

విద్యారంగంలో బాలికల విద్య కోసమే కాదు ఉన్నతవిద్యలో ముస్లింల ప్రాతినిధ్యం పెరగాలని కోరుకునే నైమా ఖాతూన్‌ను భారత ప్రభుత్వం గుర్తించి రెండు రోజుల క్రితం అత్యంత ప్రతిష్ఠాత్మకమైన అలీగఢ్ ముస్లిం విశ్వవిద్యాలయానికి వైస్ చాన్సలర్‌ను చేసింది. దాదాపు 100 ఏళ్లకు మించిన ఘన చరిత్ర ఉన్న ఈ విశ్వవిద్యాలయానికి ఇలా ఒక మహిళ వి.సి. పదవిలో కూచోవడం ఇదే మొదటిసారి.

గమనించాల్సిన విషయం ఏమంటే ఇన్నాళ్లు పురుషులు మాత్రమే వి.సి.లుగా ఉన్న జె.ఎన్.యుకు శాంతిశ్రీ పండిట్ మొదటి మహిళా వి.సి. కావడం, అలాగే జామియా మిలియా ఇస్లామియాకు నజ్మా అక్తర్ తొలి వి.సి. కావడం (ఆమె పదవీకాలం ముగిసింది) పాతమూసలను బద్దలు చేయడమే. ఆ వరుసలో ఇప్పుడు నైమా ఖాతూన్ చేరారు.

సైకాలజీ ప్రొఫెసర్

ఒడిశాకు చెందిన నైమా ఖాతూన్ ఉన్నత విద్య అలీగఢ్ ముస్లిం యూనివర్సిటీలోనే జరిగింది. అక్కడే ఆమె బి.ఎ. సైకాలజీ చదివింది. ఆ తర్వాత పి.హెచ్‌డి. వరకూ అక్కడే కొనసాగి 1988లో అదే యూనివర్సిటీలో లెక్చరర్‌గా తన ప్రయాణం మొదలెట్టింది. ఆ తర్వాత అసోసియేట్ ప్రొఫెసర్‌గా, ప్రొఫెసర్‌గా పదోన్నతి పొంది సైకాలజీ డిపార్ట్‌మెంట్ చైర్‌పర్సన్ అయ్యింది. పొలిటికల్ సైకాలజీ అధ్యయనంలో భాగంగా 'హిందూ ముస్లిం యువతపై రాజకీయ భావోద్వేగాల ప్రభావం' అనే అంశం మీద ఆమె చేసిన పి.హెచ్‌డి. కీలకమైనది. అలీగఢ్ విమెన్స్ కాలేజ్‌కు ప్రిన్సిపాల్‌గా పని చేస్తూ ఉండగా ఆమెను వి.సి.గా పని చేసే అవకాశం వరించింది. ఇప్పుడు ఎలక్షన్ కోడ్ అమలులో ఉంది కనుక ఇ.సి. అనుమతి తీసుకోని ఆమె నియామకం చేసింది ప్రభుత్వం. నైమా ఖాతూన్ తరచూ అమెరికాలోని విశ్వవిద్యాలయాల్లో తన పరిశోధనా పత్రాలను సమర్పిస్తుంటారు.

రాజకీయ ప్రాతినిధ్యం

భారతదేశంలో మహిళలకు రాజకీయ ప్రాధాన్యం లభించడం లేదని నైమా ఖాతూన్ అంటారు. ముఖ్యంగా అణగారిన వర్గాల స్త్రీలు పార్లమెంట్ వరకూ చేరుకోవడానికి చాలా అడ్డంకులు ఉన్నాయని, రాజకీయ అధికారం లేకుండా కీలకమైన విధానమార్పు తేలేమని అభిప్రాయపడతారు. 'ఆర్థిక శక్తిని, రాజకీయ శక్తిని పొందడటంలో అణగారిన వర్గాల స్త్రీలు నిస్సహాయంగా ఉన్నారు' అంటారామె.

కొత్త దారి

బాధ పడి ఆ బాధను కాలగమనంలో మరచిపోయేవారు కొందరు.

బాధ పడి ఆ బాధలో నుంచి కొత్త అడుగు వేసేవారు కొందరు.

కలైయారసి రెండో కోవకు చెందిన మహిళ.

నేతకార్మికుల బంగారు కాలాన్ని కళ్లతో చూసిన కలైయారసి అవే కళ్లతో వారి కష్టాలను చూసింది. ఆ బాధలో నుంచి 'రాట్టై' స్టార్టప్‌కు శ్రీకారం చుట్టింది.

సంప్రదాయ నేతకళకు డిఐవై(డూ ఇట్ యువర్ సెల్ఫ్) కిట్స్ ద్వారా కొత్త వెలుగు తెస్తోంది తమిళనాడుకు చెందిన కలైయారసి రామచంద్రన్. పిల్లలు, పెద్దలు ఉపయోగించేలా ఈ కిట్‌ను డిజైన్ చేశారు. సంప్రదాయ కళకు విస్తృత ప్రాచుర్యం కల్పిస్తున్న కలైయారసి గురించి....


కలైయారసి

నేతకళ నేస్తం

సాఫ్ట్‌వేర్ టు వీవింగ్

కొన్ని సంవత్సరాల క్రితం...

'చదువుకోవాలని ఉంది' అని తన మనసులోని మాటను భర్తకు చెప్పింది కలైయారసి. పెళ్లికి ముందు పై చదువులు చదువుకోడానికి ఆర్థిక ఇబ్బందులు అడ్డుగోడలుగా నిలిచాయి. ఆర్థిక ఇబ్బందుల వల్ల పై చదువులకు తల్లిదండ్రులు ససేమిరా అన్నారు. కలైయారసి మనసులో మాట విన్న భర్త 'తప్పకుండా' అని ప్రోత్సహించాడు. అలా కలైయారసి ఎంసీఎ పూర్తి చేసింది. ఆ తరువాత ఒక ఐటీ కంపెనీలో డెవలపర్‌గా పని చేసింది.

ఈరోడ్(తమిళనాడు) జిల్లాలోని సాలంగపాలయం గ్రామానికి చెందిన కలైయారసి నేతకార్మికుల కుటుంబం నుంచి వచ్చింది. సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేసినా నేతకళపై ఆమెకు ఉన్న ప్రత్యేకాభిమానం మాత్రం దూరం కాలేదు. సెలవుల్లో సొంత ఊరుకు వచ్చిన కలైయారసి అక్కడ నేతకార్మికుల కష్టాలను ప్రత్యక్షంగా చూసింది. ఊళ్లో చేనేత మగ్గాల సంఖ్య 7,500 నుంచి 2,500కు పడిపోయింది.

కష్టాలలో ఉన్న నేతకార్మికులకు ఆసరాగా నిలవడానికి తన వంతుగా ఏదైనా చేయాలనుకుంది కలైయారసి. నేతకళ గురించి మరిన్ని వివరాలు తెలుసుకొని 'రాట్టై హ్యాండ్లూమ్' పేరుతో స్వగ్రామంలో ఎకో–ఫ్రెండ్లీ హ్యాండ్లూమ్ స్టార్టప్‌కు శ్రీకారం చుట్టింది. పర్యావరణహిత కోణంలో ఆలోచించి ఆర్గానిక్ క్లాత్ వీవింగ్‌పై ప్రత్యేక దృష్టి పెట్టింది.

'నేతపని ద్వారా ఉపాధి పొంది సంతోషంగా ఉన్న కార్మికుల ఆర్థికపరిస్థితి ఆ తరువాత దిగజారిపోయింది.

చాలామంది ఉపాధి వెదుక్కుంటూ పట్టణాల బాట పట్టారు. డబుల్ షిఫ్టలలో పనిచేసేవాళ్లు. కొందరు వాచ్‌మెన్‌గా పని చేశారు. తల్లిదండ్రులు ఊళ్లో లేకపోవడంతో పిల్లల చదువు గాడి తప్పింది. తమిళనాడులో ఎన్నో గ్రామాలకు వెళ్లి నేతకార్మికులతో మాట్లాడి వారి కష్టాలు తెలుసుకున్నాను. ఈ పరిస్థితి నాకు బాధాకరంగా అనిపించింది' అంటున్న కలైయారసి తాను చేస్తున్న ఉద్యోగానికి రాజీనామా చేసి నేతకళను స్వయంగా నేర్చుకుంది. సహజరంగులతో పాటు అరటి పీచు, జనపనార, ఇతర పదార్థాలతో తయారుచేసిన సేంద్రియ నూలును 'రాట్టై' ఉపయోగిస్తోంది. ప్రస్తుతం 28 కుటుంబాల వరకు 'రాట్టై హ్యాండ్లూమ్' కోసం పనిచేస్తున్నాయి.

సంప్రదాయ చేనేత వస్త్రాలకు ఊతం ఇచ్చేందుకు పోర్టబుల్ డిఐవై హ్యాండ్లూమ్ కిట్‌ల ఆలోచనకు శ్రీకారం చుట్టింది కలైయారసి.

ఎక్కడికంటే అక్కడికి చేతితో తీసుకెళ్లగలిగే ఈ మగ్గాలకు యూజర్ మాన్యువల్, క్యూ ఆర్ కోడ్ ఉంటుంది. దీని ద్వారా యూట్యూబ్ వీడియోల సహాయంతో పరికరాన్ని ఎలా ఉపయోగించాలో తెలుసుకోవచ్చు. తమిళనాడులోని ఎన్నో స్కూల్స్‌లో పిల్లల దగ్గర పోర్టబుల్ లూమ్స్ కనిపిస్తున్నాయి. స్కూల్స్‌లో వీవింగ్ క్లబ్స్ ఏర్పాటు కావడం మరో విశేషం. మూడు ఆప్షన్‌లలో, మూడు స్థాయుల్లో అందుబాటులో ఉన్న వీటిని పెద్దలు, పిల్లలు ఉపయోగించవచ్చు.

'రాట్టై' స్టార్టప్ 'రైజింగ్ స్టార్ ఆఫ్ ది ఇయర్' అవార్డ్ గెలుచుకుంది. టాన్‌సీడ్ (తమిళనాడు స్టార్టప్ అండ్ ఇనోవేషన్ మిషన్) ద్వారా పది లక్షల గ్రాంట్ వచ్చింది.

'నేతకార్మికులకు ఉపాధి కల్పించడమే కాదు ఈ తరానికి ఆ కళపై ఆసక్తి కలిగేలా, నేర్చుకునేలా చేయాలనేది నా లక్ష్యం' అంటుంది కలైయారసి.

పిల్లల కోసం వర్క్‌షాప్



'రాట్టై' ద్వారా నేత కార్మికులకు అండగా నిలిస్తూనే మరో వైపు నేతకళపై పిల్లలకు అవగాహన, ఆసక్తి కలిగించడానికి వర్క్‌షాప్‌లు నిర్వహిస్తోంది కలైయారసి. పెద్దలకు 'నేతపనిని స్ట్రెస్–బస్టింగ్ ఎక్సర్‌సైజ్‌గా పరిచయం చేస్తోంది. 'వీలైనన్ని ఎక్కువ స్కూల్స్‌కు వెళ్లి పిల్లలకు నేత కళ గురించి చెప్పాలనుకుంటున్నాను. ఒక ఆర్ట్‌గా మన విద్యావిధానంలో నేతకళ భాగం కావాలని ఆశిస్తున్నాను' అంటుంది కలైయారసి.

బ్యూటిప్



- చేతులు, పాదాలపై నల్లటి మచ్చలుంటే వాడేసిన నిమ్మతొక్కతో రుద్దితే పోతాయి.
- సమ్మర్‌లో బయటకు వెళ్లేటప్పుడు పాదాలకు సాక్స్ వేసుకుంటే పగుళ్లు రాకుండా ఉంటాయి.
- రాత్రి పడుకునే ముందు పాదాలను శుభ్రంగా కడిగి ఆరిన తర్వాత మసాజ్ క్రీమ్ లేదా ఆయిల్‌తో ఐదు నిమిషాల పాటు మర్దన చేయాలి.
- పదిహేను రోజులకు ఒకసారి పెడిక్యూర్ చేసుకోవాలి.
- స్నానం పూర్తయిన తర్వాత పమిస్ స్టోన్‌తో పాదాలను మెల్లగా రుద్దాలి. ఇలా చేస్తే మృతకణాలు తొలగిపోయి పాదాలు నునుపుగా ఉంటాయి.

ఈ భూగోళం మీద ప్లాస్టిక్ తొడుగు ఉంది. అది నీటిలో నానదు. మట్టిలో కలవదు.
నిప్పులో కాల్చితే విషంగా మారుతుంది. అలాంటి ప్లాస్టిక్ వాడకం తగ్గించాలి. లేదా రీసైకిల్ చేయాలి.
అందుకే అసోంలోని ఆ స్కూల్ 2016లో వృథా ప్లాస్టిక్కే స్కూల్ ఫీజ్‌గా ప్రారంభమైంది.
ఏడేళ్లు గడిచినా దిగ్విజయంగా నడిచి పర్యావరణ హితమైన స్కూల్‌గా ప్రశంసలు అందుకుంటోంది.

● వినూత్నం

ఆ స్కూల్ ప్లాస్టిక్‌పై గెలిచింది

ఫీజుకు బదులు ప్లాస్టిక్ వేస్ట్‌ను ఎవరైనా తీసుకుంటారా? ఆ స్కూల్‌లో తీసుకుంటారు. ఎంత వేస్ట్ తెస్తే అంత మెచ్చుకుంటారు కూడా. పర్మితా శర్మ, మజిన్ ముఖ్తార్ అనే పర్యావరణ ప్రేమికుల, బాలల హితుల వినూత్న ఆలోచన ఇది. అసోంలోని పమోహీలో 'అక్షర్' పేరుతో వీరిద్దరూ ఒక పాఠశాల స్థాపించారు 2016లో. దీనిని భిన్నంగా నడపాలని నిశ్చయించుకున్నారు. చదువు, స్కిల్స్, పర్యావరణ స్పృహ సిలబస్‌గా ఉండాలనుకున్నారు. అందుకే ఫీజు కట్టాలంటే నోట్లు తేవద్దు వేస్ట్ ప్లాస్టిక్ తెండి అని చెప్పసాగారు. వీలైనన్ని ప్లాస్టిక్ వ్యర్థాలు తీసుకొస్తే ఫీజు కట్టినట్లు రసీదు ఇస్తారు. మరో విషయం ఏమిటంటే ఇక్కడ విద్యార్థులను వారి వయసును బట్టి కాకుండా అవగాహన స్థాయిని బట్టి తరగతుల్లో వేస్తారు. ఎనిమిదేళ్లు వచ్చిన వారు 3వ క్లాస్‌లో ఉండాలని రూల్ లేదు. నాలుగులో ఉండొచ్చు లేదా రెండులోనూ ఉండొచ్చు.


స్కూల్ ఫీజుగా ప్లాస్టిక్‌ను ఇస్తున్న విద్యార్థులు


ప్లాస్టిక్‌ను రీసైకిల్ చేస్తున్న విద్యార్థులు

ప్లాస్టిక్ భూతం నుంచి కాపాడాలని

మనుషులు బాగా చలి పుడితే దేనితోనైనా చలిమంట వేసుకోవడానికి వెనుకాడరు. అసోంలో చలి ఎక్కువ. కాని కట్టెలు ఖర్చు. అందుకే చలిమంటల కోసం ప్రజలు ప్లాస్టిక్ బాటిళ్లను, కవర్లను తెచ్చి మంటల్లో వేయసాగారు. ప్లాస్టిక్ వ్యర్థాలను బహిరంగంగా తగులబెట్టడం పర్యావరణానికి తీవ్రమైన హాని. దీనిపై అక్కడి ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ఎంత ప్రయత్నించినా ఫలితం రాలేదు. దానికి తోడు ప్లాస్టిక్ తగులపెట్టడం వల్ల వెలువడే విష వాయువులు పీల్చి పిల్లలు జబ్బు పడసాగారు. దీంతో సామాజిక కార్యకర్త అయిన పర్మితా శర్మకు ఓ ఆలోచన తట్టింది. తన మిత్రుడు, అమెరికాలో బాలల విద్యారంగంలో పని చేస్తున్న నిపుణులు మజిన్‌తో తన ఆలోచనను పంచుకుంది. అసోం భౌగోళిక పరిస్థితుల గురించి, అక్కడ నెలకొన్న సవాళ్ల గురించి మజిన్‌కు వివరించింది. అలా వారిద్దరి ఆలోచనలో నుంచి పుట్టుకొచ్చిందే 'అక్షర్' విద్యాలయం.

ఎవరు చేరుతారు?

స్కూలంటే డబ్బు తీసుకుని చదువు చెప్పాలి. ప్లాస్టిక్ తెండి స్కూల్‌లో చేరండి అంటే ఎవరు చేరతారు. పైగా సంప్రదాయ విద్యకు, వృత్తి విద్యకు మధ్య వారధిగా ప్రారంభించిన ఈ పాఠశాలకు విద్యార్థులను రప్పించడం మొదట్లో సవాలుగానే మారింది. ఇక అక్కడి పేద పిల్లలు దగ్గర్లోనే ఉన్న రాళ్ల క్వారీలలో పనిచేస్తారు. వారిని బడికి పంపిస్తే ఆదాయం కోల్పోతామని తల్లిదండ్రులు పిల్లల్ని స్కూలుకు పంపేందుకు ససేమిరా అన్నారు. దీంతో తల్లిదండ్రుల అవసరాలకు తగిన విధంగా స్కూల్ సమయాన్ని, బోధనను 'అక్షర్' లో రూపకల్పన చేశారు.

ప్లాస్టిక్ ఇటుకలు

'అక్షర్'లో నెదర్లాండ్స్ నుంచి తెప్పించిన మెషినరీ ద్వారా ప్లాస్టిక్ రీసైక్లింగ్ చేస్తారు. పాత ప్లాస్టిక్‌తో ఇటుకలు తయారు చేస్తారు. వీటిని నిర్మాణాల్లో వాడొచ్చు. పిల్లలు స్కూల్ అయ్యాక ఈ ఇటుకల తయారీ నేర్చుకుంటున్నారు. అలాగే పూలకుండీలు, బౌల్స్ వంటివి ప్లాస్టిక్ వ్యర్థాలతో తయారు చేస్తున్నారు. ఇప్పటి వరకూ దాదాపు రెండున్నర వేల ప్లాస్టిక్ బాటిళ్లు, ఏడు లక్షల ప్లాస్టిక్ కవర్లు ఇక్కడ రీసైకిల్ అయ్యాయి. అసోంను ప్లాస్టిక్ పీడ నుంచి విముక్తం చేయాలంటే తమ స్కూల్ మోడల్‌ని ఫాలో కావాలని పర్మిత, మజిన్ ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. ఇప్పటికి 5 స్కూళ్లు ఈ విధానాన్ని అవలంబిస్తున్నాయి. అంటే ఫీజుగా ప్లాస్టిక్‌ను తీసుకుంటున్నాయి. మరో వంద స్కూళ్లు ఇలా చేస్తే బాగుంటుందని పర్మిత, మజిన్ భావిస్తున్నారు. అసోంలో మాత్రమే కాదు దేశమంతా ఈ మోడల్‌ను ఉపయోగిస్తే ప్లాస్టిక్ వ్యర్థాలను కచ్చితంగా తరిమికొట్టడం వీలవుతుంది.